జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 10-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 479 పేజీలు: 4 వెల: రూ.7

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో..
# భారీ వసూళ్లు






* మాజీ బీసీ సంక్షేమ అధికారి కృతికపై చర్యలు
* మూడు సంవత్సరాల పాటు పెన్షన్‌పై 3శాతం కోత!
* పెద్ద ఎత్తున వసూళ్లపై మరికొందరి పాత్ర పైనా అనుమానం
* మొత్తంగా ఆరేళ్ల తర్వాత శిక్ష ఖరారు

**శ్రీకాకుళం, అక్టోబరు 9 (వార్త):** నియామకాలలో పారదర్శకత లేకపోతే ఫలితం తప్పదన్న నిదర్శనం ఇది! అవుట్‌సోర్సింగ్ నియామకాలలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో ప్రభుత్వం మాజీ బీసీ సంక్షేమ అధికారి కె.కె.కృతికపై పెన్షన్ కోత విధించింది. పదవీ విరమణ తరువాత కూడా బాధ్యత నుంచి చివరకు ఆమె తప్పించుకోలేకపోయారు. బీసీ సంక్షేమ శాఖ విడుదల చేసిన జి.ఓ.ఆర్.టి నెం.128 (తేది 09-10-2025) ప్రకారం కె.కె.కృతిక, శ్రీకాకుళం మాజీ జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి (31.08.2021న పదవీ విరమణ చేశారు) పై మూడు సంవత్సరాల పాటు 3 శాతం పెన్షన్ కోత విధించబడినది అని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్తర్వును ప్రభుత్వ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ గవర్నర్ తరపున జారీ చేశారు. 2019లో శ్రీకాకుళం జిల్లాలో బీసీ సంక్షేమ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో కృతిక భారీగా వసూళ్లు చేశారనే ఆరోపణలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఎట్టకేలకు కృతికపై శాశ్వత చర్యలు ప్రారంభించింది. ఆమెపై మొత్తం ఆరు ఆరోపణల పత్రాలు సిద్ధం చేశారు. ఈ ఆరోపణలపై సమాధానమిస్తూ కృతిక, ఎప్పటి లాగానే అన్ని ఆరోపణలు తప్పుడువని, నిరాధారమైనవని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఆ సమాధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేయకుండా విచారణాధికారిగా డైరెక్టర్ కార్యాలయానికి చెందిన సంయుక్త సంచాలకుడుని నియమించింది. ఆ దర్యాప్తులో ఒక ఆరోపణ పూర్తిగా, రెండు పాక్షికంగా రుజువు అయ్యాయి. మరో మూడు ఆరోపణలు రుజువు కాలేదు. సుదీర్ఘ విచారణ అనంతరం విచారణ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం విధాన పరమైన లోపాలు, నియామకాల్లో అధికారి కృతిక నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతిందని అభిప్రాయపడింది. దీంతో ఆంధ్రప్రదేశ్ రివైజ్డ్ పెన్షన్ రూల్స్%-%1980లోని రూల్ 9 ప్రకారం శిక్ష విధించడమే సరైనదని తేల్చింది. పదవీ విరమణ అంటే బాధ్యతల నుంచి విముక్తి కాదని ఈ ఉత్తర్వు చూపిస్తోంది. భవిష్యత్తులో ఎవరైనా నియామకాల్లో తప్పులు చేస్తే కఠిన చర్య తప్పదని బీసీ సంక్షేమ శాఖలో ఓ ఉన్నతాధికారి తెలిపారు.

### అవుట్‌సోర్సింగ్ నియామకాలలో ఏం జరిగింది?

విచారణలో తేలిందేమిటంటే.. కొందరు అభ్యర్థుల అర్హత ధ్రువపత్రాలు పూర్తి స్థాయిలో లేవు. కొందరిని ఎంపికచేసే విధానం నిబంధనలకు విరుద్ధంగా సాగింది. నియామకాల తుది జాబితా అధికార అనుమతుల్లేకుండా మార్చబడింది. ఈ అంశాలు అన్ని అనుచిత నియామకాలు జరిగాయని సూచించే ఆధారాలుగా గుర్తించబడ్డాయి. ఇందుకు గాను భారీ గా ముడుపులు చేతులు మారాయని తేలింది. మొత్తంగా ఈ వ్యవహారం "సేవలో ఉన్నా, రిటైర్ అయినా, తప్పు చేసినా తప్పించుకోలేరు" అనే సంకేతాన్ని ప్రభుత్వం ఇచ్చింది. శాఖ వర్గాల సమాచారం ప్రకారం మరికొన్ని అవుట్‌సోర్సింగ్ నియామక ఫైళ్లను కూడా మళ్లీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తదుపరి దశలో ఇతర అధికారులపైనా చర్యలు ఉండే అవకాశముందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## సారా తయారీ.. విక్రయం.. రవాణాపై..
# నిరంతరం దాడులు

* సారా రహిత జిల్లాయే లక్ష్యం
* ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, అటవీశాఖలు సమష్టిగా పనిచేయాలి
* నిఘా పటిష్టానికి 75 మంది ఆఫీసర్ల నియామకం
* 179 కేసులు, 221 మంది అరెస్ట్
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, అక్టోబరు9 (వార్త):** జిల్లాలో నాటుసారా తయారీ విక్రయాన్ని పూర్తిగా అరికట్టడానికి 'నవోదయం 2.0' కార్యక్రమం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సారా రహిత జిల్లా లక్ష్యం సాధించే వరకు దాడులు, నిఘా కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు 179 ఐడీ లిక్కర్ కేసులు నమోదు చేయగా, 221 మందిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో 3477.8 లీటర్ల ఐడీ మద్యంను స్వాధీనం చేసుకోగా, 27,790 లీటర్ల జేఎఫ్ (ఎఫ్ జె ) వాష్‌ను ధ్వంసం చేశామని చెప్పారు. సారా తయారీకి ఉపయోగించిన 75 కిలోల బెల్లంతో పాటు, నేరాలకు వినియోగించిన 17 వాహనాలను అధికారులు సీజ్ చేశామన్నారు. బెల్లం సరఫరాదారులపైనా దృష్టి సారించి, ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న 6 మంది బెల్లం వ్యాపారులను కూడా అరెస్టు చేసినట్టు సమీక్షలో కలెక్టర్ వెల్లడించారు. మరింత సమర్థవంతమైన దాడుల కోసం, గ్రామాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించినట్టు అధికారులు తెలిపారు. అలాగే 110 గ్రామాలు, 11 మండలాలను గుర్తించి, 1143 మంది అనుమానితుల ప్రొఫైల్స్ తయారుచేయడం, నిఘాను పటిష్టం చేయడానికి 75 మంది ఆఫీసర్లను నియమించడం వంటి కీలక చర్యలను కలెక్టర్ సమీక్షించారు. సారా గురించి ఎవరైనా.14405 టోల్‌ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయాలని కోరారు. సారా తయారీకి సహకరించే గ్రామాలకు ప్రభుత్వ పథకాలు నిలిపివేయబడతాయనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. అధికారులు గ్రామాల్లో సారా తయారీ, వినియోగం పూర్తిగా లేదని నిర్ధారించుకున్న తర్వాతే వాటిని సారా రహిత గ్రామాలుగా డిక్లరేషన్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ తిరుపతి నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వేటకు వెళ్లిన మత్స్యకారి యువకుడి మృతి

**పలాస/వజ్రపుకొత్తూరు, అక్టోబరు9 (వార్త):** సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకార యువకుడు మృతి చెందిన ఘటన వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ తీరంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దేవునల్తాడ గ్రామానికి చెందిన బుడగట్ల చిన్నబాబు చింతల అప్పారావు, బుంగ లోకనాథం, చంద్రగిరి మోహన్‌రావు, బుంగ మోహన్‌రావు గురువారం ఉదయం వేటకు వెళ్లారు. అలల ఉద్ధృతికి అదుపుతప్పి చిన్నబాబు సముద్రంలో జారిపడ్డాడు. అతడిని గాలించి బోటుపైకి తీసుకొచ్చినప్పటికే మృతిచెందినట్లు తోటి మత్స్యకారులు తెలిపారు. ఈ ఘటనతో దేవునల్తాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నబాబు మృతిపై అతడి తల్లి గునసరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ప్రేమ పేరుతో వంచన

**బూర్జ, అక్టోబరు 9(వార్త):** ప్రేమ పేరుతో వంచించిన ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బూర్జ మండలంలోని ఓ గిరిజన గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను సవర పవన్‌కుమార్(20) ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబరచుకున్నాడు. ఈ క్రమంలో ఆ బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో అతడిని నిలదీయగా, తనకు సంబంధం లేదన్నారు. దీంతో బాలిక తండ్రి బూర్జ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సచివాలయం ఉద్యోగుల జేపీసీ ఏర్పాటు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 9(వార్త):** ఇచ్ఛాపురం మండల సచివాలయం ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ దేవాలయం వద్ద ఎన్నిక నిర్వహించారు. జేపీసీ చైర్మన్‌గా పొల్లాయి అశోక్, సెక్రెటరీ జనరల్‌గా బి.మనోజ్, కన్వీనర్‌గా పి.తారకేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సల్ల ప్రవీణ్, వైస్ చైర్మన్‌గా జోగమ్మ, మల్లేష్. ట్రెజరర్‌గా బాలకృష్ణ, నీరజ, పబ్లిసిటీ సెక్రటరీగా చిన్నారావు లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా డి.చిరంజీవి, శారద పాడి, కవిత, సంతోష్, జయమ్మ, గోపాలరావు. డి.నవీన్ ఎన్నికయ్యారు.



# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ సీజన్ రానున్న నేపథ్యంలో ధాన్యం సేకరణకు సమయం ఉన్నందు వలన గ్రామ, మండల స్థాయిలో సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ధాన్యం సేకరణ ఆలస్యం లేకుండా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సేకరణ చేయాలని ఆదేశించారు. పంటలు పండిన తర్వాత వర్షాలు వస్తే రైతులకు టార్పాలిన్లు అందేటట్లు చూడాలని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ క్రాప్ ఎంత అయ్యిందని కలెక్టర్ వ్యవసాయ శాఖ జెడిని అడుగగా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు కలిపి 5 లక్షలు అయినట్లు జెడి కలెక్టర్ కు వివరిం చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ గత సమస్యలు పునరావృతం కారాదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సిబ్బంది అందరూ బాధ్యతగా ఉండాలని చెప్పారు. రైతులకు,



అధికారులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ జరుదుతుందని తెలిపారు. రైతులకు ముందుగానే ఒక ప్రణాళికను తెలియజేయాలని వ్యవసాయ శాఖ జెడి ని ఆదేశించారు. సివిల్ సప్లయ్స్ డియం వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు ఇచ్చే సిబ్బందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. 630 సచివాలయాలు ఉండగా, 530 రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం సేకరణ జరుగనున్నట్లు వివరించారు. గతంలో ఎదుర్కొన్న సమస్యలను అధికమించాలన్నారు. సిబ్బంది అందరూ బాగా పని చేసే విధంగా శిక్షణ బాగా ఇస్తామన్నారు. రైతుల వద్ద తీసుకోనున్న ధాన్యంలో ఉన్న తేమ శాతం తెలుసుకొనే విధంగా అక్కడే మిషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైస్ మిల్లు, రైతు సేవా కేంద్రాలు వద్ద ఉన్న తేమ తెలియజేసే మిషన్లు ఒక కంపెనీవై ఉంచాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ధాన్యం సేకరణ చేయాలని చెప్పారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. 5135 జిపియస్ కలిగిన వాహనాలు ఉంటాయన్నారు. జిపియస్ ఉన్న వాహనాలను మాత్రమే ధాన్యం తరలింపుకు తీసుకుంటామని చెప్పారు. కష్టోడియన్ ఆఫీసర్ ప్రముఖపాత్ర పోషించాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా సిబ్బంది అందరూ చూడాలి. వ్యవసాయ శాఖ జెడి త్రినాధ స్వామి మాట్లాడుతూ జిల్లాలో సాగు అవుతున్న ధాన్యం రుణాలను వివరించారు. ధాన్యం పంటలు గూర్చి తెలిపారు. మిల్లర్స్ అసోసియేషన్ నుండి ఆఫ్ లైన్ లో చాలా ఇబ్బందులు పడినట్లు చెప్పారు. రైతులు నష్టపోకుండా వారికి న్యాయం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు జి. జయదేవి, పద్మావతి, తహసీల్దార్లు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ సివిల్ సప్లయ్ అధికారులు, సివిస్ డిటీలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన




**పలాస, అక్టోబరు 9(వార్త):** అన్నం పరబ్రహ్మ స్వరూపం... అన్నదాత సుఖీభవ.. దేశానికి వెన్నుముఖ రైతు... జై జవాను – జై కిసాన్ అను సుభాషితాలు వెనుక ఉన్న ఆంతర్యము.. ఆహారమునకు మూలాధారమైన వ్యవసాయము లో రైతు పాత్ర, ఆహారము నోటికి అందడానికి ముందు రైతుపడే కష్టాలను విద్యార్థులకు కళ్ళారా ప్రయోగాత్మకంగా చూపించి వారిలో వ్యవసాయంపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పర్యటనలో బాగంగా గురువారం రామకృష్ణపురం శ్రీ సత్యసాయి విద్యావిహార్ యాజమాన్యం 8వ తరగతి చదువుతున్న 126 మంది విద్యార్థులను రామకృష్ణపురం పరిధిలో ఉన్న పొలాల వద్దకు వృక్ష శాస్త్రం ఉపాధ్యాయులు చిన్నారావు తీసుకుని వెళ్ళి వరిపంటకి సంబందించి విత్తనాలు నాటిన నుంచి వరి చేతికి అందినవరకు సోదాహరణముగా వివరిస్తూ వరి పంటకు ఎన్ని సీజన్ లు, వరి పంటలలో ఎన్ని రకాలు, పలు రకాల పంటలు పండించడానికి ఎన్ని రోజులు పడుతుంది అన్నివిషయాలు కళ్ళకి కట్టినట్లు సవివరంగా వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ ఆహార పదార్థాలు వేస్ట్ చేయకపోవడమే రైతుకి మనము చూపే అసలైన కృతజ్ఞతలు అని తెలియజేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో కార్యక్రమం వల్ల, మనము నిత్యం తినే ఆహారం కు సంబంధించిన అనేక విషయాలు చక్కగా తెలుసుకున్నాము అన్న అభిప్రాయలను వ్యక్తపరిచారు. క్షేత్రస్థాయి పర్యటనలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ మురళీ, ఉపాధ్యాయులు, సాంబమూర్తి, అనుదీప్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు నగరంపల్లి హైస్కూల్ విద్యార్థుల ఎంపిక

**పలాస, అక్టోబరు 9(వార్త):** శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో నగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల చదువుతున్న పదో తరగతి విద్యార్థి బి. కుమారస్వామి లాంగ్ జంప్ లో, బి. కిరణ్ జావీలిన్ త్రో లో తొమ్మిదో తరగతి విద్యార్థిని బి. హారిక, ఎనిమిదో తరగతి విద్యార్థి ఎన్. రాజ్ కమల్ అండర్ -14 కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి శిక్షకులుగా వ్యాయామ ఉపాధ్యాయులు పి. గజేంద్ర రావు, జె. నారాయణ రావు వ్యవహారించారు.



గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తలగాన హేమరావు, పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మిపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ యూత్ వాలంటీర్లుగా దరఖాస్తుల ఆహ్వానం

**నెలకు రూ.5000 స్టైఫండ్**

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** సమాజ సేవ చేయాలనే ఆసక్తి గల శ్రీకాకుళం జిల్లా యువతకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. 2025-26 సంవత్సరానికిగాను నేషనల్ యూత్ వాలంటీర్ల ఎంపిక కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మై భారత్ (మై భారత్) డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ తెలిపారు. ఒక సంవత్సరం పాటు స్వచ్ఛంద సేవ చేయడానికి ఆసక్తి గల, 01 అక్టోబర్, 2025 నాటికి 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 10వ తరగతి విద్యార్హత ఉండాలి. ఇది కేవలం స్వచ్ఛంద సేవ మాత్రమే, ఉద్యోగం కాదని గమనించాలి. ప్రస్తుతం చదువుతూ ఉన్నవారు లేదా ఉద్యోగం చేస్తున్నవారు దరఖాస్తు చేయడానికి అనర్హులు. ఎంపికైన వాలంటీర్లకు నెలకు రూ.5,000/- చొప్పున స్టైఫండ్ చెల్లించబడుతుంది. ఎంపికైన వాలంటీర్లు ఒక సంవత్సరం పాటు వివిధ సామాజికాంశాలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుంది. ముఖ్యంగా యువజన సంఘాల స్థాపన, క్రీడలు, ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుద్ధ్యం, లింగ వివక్ష, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలపై వీరు పనిచేయాలి. ఉన్నత విద్యార్హత, కంప్యూటర్ అప్లికేషన్స్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ కలిగి ఉండి ఈ-బ్యాంకింగ్, డిజిటల్ వంటి వివిధ మొబైల్ అప్లికేషన్స్‌లో పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అలాగే మై భారత్ అనుబంధ యువజన సంఘాల సభ్యులకు, మెంటార్ యూత్ క్లబ్ సభ్యులకు మరియు మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.

ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ పద్ధతిలో https://nyks.nic.in/NationalCorps/nyc.html లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తులను పంపడానికి చివరి తేదీ 15 అక్టోబర్, 2025. అభ్యర్థులు తప్పనిసరిగా శ్రీకాకుళం జిల్లా వాసులై ఉండాలనే నిబంధన ఉంది. దరఖాస్తుల స్వీకరణ మరియు అభ్యర్థుల ఎంపిక మై భారత్ ముఖ్య కార్యాలయం నియమ నిబంధనలకు లోబడి జరుగుతుంది. పూర్తి వివరాల కోసం జిల్లా మై భారత్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు లేదా డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ (ఫోన్ నెంబర్లు: 08942-222028, 8142172119)ను సంప్రదించాలని ఆయన కోరారు.

## వనరులు సేకరించుకోవాలి

**కోటబొమ్మాళి, అక్టోబరు 9(వార్త):** పంచాయతీల అభివృద్ధికి వనరులు సేకరించుకోవాలని మండల పరిషత్ పరిపాలన అధికారి కె. నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకు సొంత ఆదాయం సేకరించుకోవటానికి పలు పకాల్కైన వనరులు ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా సర్పంచ్‌లు శిక్షణలో పాల్గొని వనరులపై కార్యదర్శులకు సహకరిస్తు సమీకరించుకుంటే పంచాయతీలు అభివృద్ధి జరుగుతాయన్నారు. ఈ శిక్షణలో ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో పల్లి వెంకటేష్, రిసోర్సు పర్సన్ బి. బాలక్రిష్ణ, సీనియర్ కార్యదర్శి బి. నరేష్ తదితరులు ఉన్నారు.





## 150మంది గర్భిణులకు పౌష్టికాహారం

**మందస, అక్టోబరు 9(వార్త):** హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 150 మంది గర్భిణులకు లయన్స్ క్లబ్ కోస్టల్ ప్రతినిధులు పౌష్టికాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ కోస్టల్(హరిపురం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్ కణితి స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ బాలకృష్ణ, ఆసుపత్రి కమిటి మెంబర్ ఏర్పుల జోగారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మార్పు వెంకటేశం, ఎరుకోల సత్యన్నారాయణమూర్తి, మండెల్లి లక్ష్మణరావు, పాపారావు, పుల్లా వాసుదేవు, భానోజి రావు, ఆశ వర్కర్స్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీజీబీ డిజిటల్ సేవల్లో అంతరాయం



**మందస, అక్టోబరు 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బ్యాంకింగ్ సేవలు, డిజిటల్, ఆన్లైన్ సేవలలో ఈనెల 9వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ ఉదయం 10గంటల వరకు అంతరాయం కలుగుతుందని మందస బ్రాంచ్ మేనేజర్ కరాస జనార్దన్ తెలిపారు. మందసలో ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నామని, ఖాతాదారులు సహకరించాలని కోరారు. తమ బ్యాంక్ ద్వారా అన్ని ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, డిజిటల్, ఆన్లైన్ సేవలు తదితర సేవలు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు. బ్యాంక్ సీబీఎస్(కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్) అనుసంధానించడంలో భాగంగా జరిగే సాంకేతిక ప్రక్రియ కారణంగా ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్లైన్ లావాదేవీలు, యు.పి.ఐ, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏఈపీఎస్ సేవలకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఖాతాదార్లు ఆర్థిక లావాదేవీలను తగువిధంగా ప్లాన్ చేసుకోగలరని ఆయన కోరారు.

## విద్యార్థుల్లో క్రమశిక్షణ ఎంతో అవసరం



**మందస, అక్టోబరు 9(వార్త):** విద్యార్థుల్లో క్రమశిక్షణ ఎంతో అవసరమని, దీంతో వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు అన్నారు. సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సమావేశంలో సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ పిల్లల్లో క్రమశిక్షణ అత్యవసరమని, పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థినిలు ఎటువంటి ప్రలోభాలకు పోకుండా ఆకతాయిలకు అవకాశమివ్వకుండా మెలగాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఏర్పడినప్పుడు తక్షణమే పోలీసుశాఖను సంప్రదించాలని, వెంటనే 112కు కాల్ చేయమని సలహా ఇచ్చారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండాలని, మత్తు పదార్థాల జోలికి పోకూడదన్నారు. అవి భవిష్యత్తును నాశనం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఎస్.వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ కె.ఢిల్లేశ్వరరావు, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కిక్కర ఢిల్లీరావుకు సన్మానం

**పలాస, అక్టోబరు 9(వార్త):** పలు కళా రంగాల్లో విశేష సేవలందిస్తున్న బొడ్డపాడు గ్రామం జెస్సి ఈవెంట్స్ ఆర్గనైజర్ కిక్కర ఢిల్లీ రావుకు అమలాకుడియా గ్రామంలో గురువారం జెస్సి ఈవెంట్స్ కళా ప్రదర్శనను అభినందిస్తూ గ్రామ వాస్తవ్యులు, లెక్కలు మాష్టర్ సోదరులు బుద్ధ అప్పారావు మాస్టర్ దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. తన అభిమాన గురువు, నా ఆరాధ్య దైవం స్వర్గీయ బుద్ధ వెంకటరమణ ( లెక్కలు మాష్టర్ ) స్వగ్రామం అమలాకుడియా గ్రామంలో ఈ సన్మాన కార్యక్రమం జరగడం నా పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ సదావకాశం కల్పించిన అమలాకుడియా గ్రామ పెద్దలకు, శ్రీ శ్రీ శ్రీ గౌరీ నందన్న మహొత్సవ నిర్వహణ కమిటీ వారికీ పేరు పేరునా జెస్సి ఈవెంట్స్ ఆర్గనైజర్ కిక్కర ఢిల్లీరావు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాలకృష్ణాపురం లో ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభ



**ఇచ్ఛాపురం, అక్టోబరు 9(వార్త):** బాలకృష్ణాపురంగ్రామపంచాయతీలో ఉపాధిహామీ పథకం కింద పనులు గుర్తింపు కోసం గ్రామ సభ నిర్వహించారు. (ఎన్ఆర్ఈజీఎస్) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రెండు కోట్ల రూపాయలు పనులు కోసం ఆరు నెలల ముందే గ్రామ తీర్మానం చేశారు. గ్రామపంచాయతీ నుండి ఎన్ ఐ సి కి పంపినట్లు తెలిపారు. గ్రామ సభలో పాల్గొన్న సర్పంచ్ కుమారి మరియు సర్పంచ్ ప్రతినిధి బోరుభద్ర లోహిదాస్ మరియుటెక్నికల్ అసిస్టెంట్ దక్కత పీతాంబర రెడ్డి , ఫీల్డ్ అసిస్టెంట్ గౌరీ , మెడికల్ సిబ్బంది గ్రామ పెద్దలు ప్రజలు మరియు వేతనదారులు పాల్గొన్నారు.



## ఛలో నర్సీపట్నంలో పాల్గొన్న డాక్టర్ అన్వేష్

**ఇచ్ఛాపురం, అక్టోబరు 9(వార్త):** వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో నర్సీపట్నం కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు. మెడికల్ కాలేజీ ల ప్రయివేటు పరం నకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా పాల్గొని నిర్మాణ దశ లో ఉన్న మెడికల్ కళాశాల పరిశీలన కార్యక్రమంలో పాల్గొనట్లు తెలిపారు.

## విద్యార్థుల్లో మానసిక చైతన్యం పెంపొందిద్దాం




**మందస, అక్టోబరు 9(వార్త):** ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా వీరగున్నమ్మపురం సమీపంలో గల కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ తాండ్ర వెంకటరమణ ప్రధాన అతిథిగా హాజరై, విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, కెరీర్ అవగాహన అంశాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మానసిక ఆరోగ్యం మన జీవితానికి పునాది' అన్నారు. మన భావాలను భయపడకుండా వ్యక్తపరచడం, ఒత్తిడిని సానుకూలంగా ఎదుర్కొనడం, పాజిటివ్ ఆలోచనలతో ముందుకు సాగడం ప్రతి విద్యార్థి లక్ష్యం కావాలన్నారు. అనంతరం విద్యార్థినిలు నాటికలు, పోస్టర్ ప్రదర్శనలు, స్లోగన్లు, చర్చా కార్యక్రమాల ద్వారా మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను ప్రతిబింబించారు. ముఖ్యంగా "తప్పు కాదు భావాలను చెప్పడం" అనే నినాదం విద్యార్థుల్లో విశేష స్పందనను రాబట్టింది. ప్రిన్సిపాల్ రఘుపాత్రుని వాసంతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినిల్లో ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం పెంపొందించేందుకు ఎంతో దోహదం చేస్తాయి. కౌన్సిలర్ వెంకటరమణ సేవలు పాఠశాల విద్యార్థుల మానసిక అభివృద్ధికి సహాయకంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



**పలాస, అక్టోబరు 9(వార్త):** ప్రతీ విద్యార్థి కష్ట పడి ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాశీబుగ్గ సిఐ పి. సూర్యనారాయణ అన్నారు. గురువారం పలాస మండలం రంగోయి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కాశీబుగ్గ సీఐ పీ. సూర్యనారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్, ర్యాగింగ్, గాంజాయి, బ్యాడ్ టచ్ గుడ్ టచ్, సైబర్ నేరాలు వాటి వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఎక్కడైనా పాఠశాలలు కళాశాల సమీపాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

## సుడిదోమకు నివారణ చర్యలు పాటించాలి

**కోటబొమ్మాళి, అక్టోబరు 9(వార్త):** సుడిదోమ నివారణకు కాలిబాటలు వేసుకోవా లని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్‌రావు అన్నారు. ఆయన గురువారం మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావుతో కలిసి దుప్పిలపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల నివారణ చర్యలు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువులపైనే కాకుండా జీవన ఎరువులు వినియోగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.



## 11, 12 తేదీల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్

**-టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహణ**

**-జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సామాన్యులకు ఊరట**

**-డిప్యూటీ కమిషనర్, జీఎస్టీ నోడల్ అధికారి స్వప్నదేవి**




**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ జీఎస్టీ నోడల్ అధికారి స్వప్నదేవి గురువారం వెల్లడించారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సామాన్యులకు ఊరట ఉంటుందన్నారు. శ్రీకాకుళంలో ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జీఎస్టీ చట్టంలో 2.0 పన్ను సంస్కరణల ద్వారా ఇటీవల అమలులోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపుల ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గినట్లు వివరించారు. దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, విజయదశమి, దీపావళి పండుగలను మరింత ఆనందంగా చేసుకునే సువర్ణ అవకాశం లభించిందన్నారు. ఈ పన్ను రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర జీఎస్టీ శాఖ, పరిశ్రమల శాఖ, సమాచార సాంకేతిక పరిజ్ఞానం శాఖ సహకారంతో ఒక ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేసిందన్నారు. సమాజాభివృద్ధికి పన్ను చట్టాల అవగాహన అవసరమని, పన్ను చెల్లింపుదారుడే దేశాభివృద్ధికి పునాదన్నారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ టిటిడీ కళ్యాణ మండపంలో ఈ నెల 10, 11 తేదీల్లో ఉంటుందని, ఉదయం 10.30 గంటల నుండి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, అతిథులుగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు ఉంటారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జీఎస్టీ మార్పులపై స్పష్టమైన అవగాహన, ధరల పారదర్శకత, వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరికీ హృదయపూర్వక ఆహ్వానం తెలియచేసుకుంటూ శ్రీకాకుళం పట్టణ ప్రజలు అందరూ ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆమె కోరారు.

## బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి



**మందస, అక్టోబరు 9(వార్త):** బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలనే ప్రధాన అజెండాగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో )పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావుకు మండల ఫ్యాప్టో ఆధ్వర్యంలో నాయకులు మెమోరాండం సమర్పించారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించినప్పటికీ, ప్రభుత్వం నుండి సరైన స్పందన లేని పక్షంలో ఈనెల 10వ తేదీ నుండి అన్ని బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనవసర గూగుల్ షీట్స్, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 వంటి కార్యక్రమాలను బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, యూ టీఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, ఫ్యాప్టో మందస మండల నాయకులు ఆర్.పరమేశ్వర రావు, కె.సుందర రావు, యస్. కిరణ్‌కుమార్, యస్.సోమనాథ, యన్.ఢిల్లేశ్వర రావు, డి.చంద్రశేఖర్, బి.రామారావు, కె.చిరంజీవి, యస్.నారాయణరావు, కె.శ్రీనివాసరావు , పి.జగదీష్, బి.బైరాగి, యన్.మురళీ, కె.పద్మ, యస్.రజని, కె.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌ల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మందస, అక్టోబరు 9(వార్త):** మందస మండలంలోని బాలిగాం, మందస పీఏసీఎస్ ల పరిధిలో పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ప్రతినిధులు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు బాలిగాం, మందస పీఏసీఎస్ పరిధిలో గల బాలిగాం, కొత్తపల్లి, సొండిపూడి, పిడిమందస, మందస, బైరిసారంగపురం, నర్సింగపురం, సాబకోట, చీపి, బుడార్సింగి, సిరిపురం, బెల్లుపట్టియాలలో గల రైతు సేవా కేంద్రాలలో పనిచేయడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుల దగ్గర నుంచి ధాన్యం సేకరణకు మూడు నెలల పాటు మాత్రమే పని చేయుటకు ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు టెక్నికల్ అసిస్టెంట్లు గా 12 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు గా 12 మంది అవసరమన్నారు. అర్హులైన యువతీ, యువకులు ఈ నెల 11వలోపల బయోడేటాలను బాలిగాం సొసైటీ పరిధిలో గల బాలిగాం, కొత్తపల్లి, సొండిపూడి, పిడిమందస అప్లికేషన్లు ఇవ్వాలని, మిగిలిన అభ్యర్థులు మందస పీఏసీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ కు జీతం రూ.15వేలు, కంప్యూటర్ ఆపరేటర్ కు జీతం రూ.12వేలు ఇవ్వబడుతుందని తెలుగుదేశం పార్టీ మందస మండల కమిటీ నాయకులు తెలిపారు.

## విద్యార్థులకు సురక్షిత నీరందించాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దిశానిర్దేశం**

**-జ్వరాలపై ప్రత్యేక దృష్టి, 3000**

**నీటి వనరుల నాణ్యత పరిశీలన**



**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** జిల్లాలో సీజనల్ జ్వరాలు, పిల్లల ఆరోగ్యంపై అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ముఖ్యంగా, జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ స్వప్నిల్ జిల్లా అధికారులతో మాట్లాడారు. సురక్షిత తాగునీటి అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో దాదాపు 3000 నీటి వనరులు వివిధ రూపాల్లో ఉన్నాయని, ప్రతి రోజు ఎక్కడో ఒక చోట నీటి నాణ్యత పరీక్షలు నిరంతరం జరుగుతుండాలి.. దీని కోసం అవసరమైన టెస్టింగ్ కిట్‌లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేస్తున్నాము. వసతి గృహాల్లోని నీటిని ప్రాధాన్యత క్రమంలో పరీక్షిస్తూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని స్పష్టం చేశారు. జిల్లా ఆసుపత్రుల్లో అందిస్తున్న మెరుగైన సేవల వివరాలను కూడా వెల్లడించారు. సెప్టెంబర్ 2025లో డీఎంఈ ఆసుపత్రుల పరిధిలో జరిగిన పరీక్షల వివరాలు జిల్లాలో మెరుగైన వైద్య సేవలకు అద్దం పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రుల్లో సెప్టెంబర్ 2025న నిర్వహించిన మొత్తం ల్యాబ్ పరీక్షలు: 1,25,657 అని, ఇంకా రేడియాలజీ పరీక్షలు 4,833 గా ఉన్నాయని వివరించారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తాగునీరు, ఆరోగ్యం అంశాలతో పాటుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రీ–అసెస్మెంట్, ఎస్సీ/ఎస్టీ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపు, దేవాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పన వంటి అంశాలను కలెక్టర్ స్వప్నిల్ సమీక్షించారు. అన్ని ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ, ప్రజల్లో సానుకూల దృక్పథం (పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్)ను పెంచేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం జీఎస్టీ తగ్గింపుతో ఇంటింటికి లబ్ది అనే గోడ పత్రికలను, డిఆర్డిఏ రూపొందించిన స్త్రీ నిధి కి సంబంధించిన బ్రోచర్లను కూడా ఆవిష్కరించారు. సంబంధించిన ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ సహా డీఆర్డీఏ, వ్యవసాయ, వెనుకబడిన, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 11న జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** ఈ నెల 11వ తేదీన జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం వెల్లడించారు. జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉంటుందన్నారు. ఈ సమావేశం రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావలసినదిగా ఆదేశించారు.

# రెవెన్యూ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలి

**-ఫిర్యాదుదారులు సంతృప్తి చెందాలి**

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):**అర్జీల పై ఫిర్యాదు దారులు సంతృప్తి చెందాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, పిజిఆర్ఎస్, రెవెన్యూ సమస్యలు, మ్యుటేషన్లు, తదితర వాటిపై ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే పని ప్రజలకు సంతృప్తికరంగా ఉండాలన్నారు. మండలాల వారీగా మ్యుటేషన్లు గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. మ్యుటేషన్లుకు సంబంధించి నోటీసులు ఏ విధంగా జారీ చేస్తారో వివరించారు. రెవెన్యూ సిబ్బంది పై పని వత్తిడి ఉన్నప్పటికీ అత్యవసరమైన పనులకు తప్పని పరిస్థితుల్లో హాజరు కావాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం, మరమ్మతులు చేయాల్సిన కార్యాలయాలు ఉంటే తక్షణమే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రెవెన్యూ క్రీడలు జిల్లా స్థాయిలో జిల్లాలో నిర్వహించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో సిఎస్ డిటిలు కీలకంగా వ్యవహరించాలన్నారు. మండల సర్వేయర్లు మ్యుటేషన్లు, ఆర్ఓఆర్ లను ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. రెవెన్యూ సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, జిల్లా



రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్లు జి. జయదేవి, పద్మావతి, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, కలెక్టరేట్ ఆయా విభాగాల పర్యవేక్షులు, శ్రీకాకుళం డివిజన్ కు సంబంధించి మండల తహసీల్దార్లు, ఆర్ ఎస్ డిటిలు, సిఎస్ డిటీలు, మండల సర్వేయర్లు, హెచ్. డిటిలు, ఆర్ఐ, విఆర్ఓ, తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఆదాయ వనరులతో గ్రామాలభివృద్ధి



**మందస, అక్టోబరు 9(వార్త):** పంచాయతీలలో సొంత ఆదాయ వనరులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని, దీంతో గ్రామాల అభివృద్ధి చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించికోవాలని మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సొంత ఆదాయ వనరుల సమీకరణ, అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులతో రెండు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పన్నులు, రుసుములు, అద్దెలు, ఇతర వినియోగదారుల ఛార్జీల ద్వారా పంచాయతీలు స్వయంగా సంపాదించే ఆదాయాన్ని సూచిస్తుందని, దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడకుండా స్వయం సమృద్ధిగా అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవచ్చని అన్నారు. పంచాయతీలు తమంతట తాముగా సేకరించే ఆదాయ మార్గాలు, ఆస్తి పన్నులు, వృత్తి పన్నులు, లైసెన్సింగ్ రుసుములు వంటి స్థానిక పన్నులు, ఆస్తుల లీజు ద్వారా వచ్చే ఆదాయం వంటి సొంత ఆదాయ వనరుల ద్వారా పంచాయతీల ఆర్థిక స్వయం సమృద్ధిని పెంచి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయన్నారు. శిక్షణకు ట్రైనర్ గా కె.కూర్మారావు, ఇంచార్జి పంచాయతీ అధికారిగా జయప్రకాశ్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఘనంగా 26వ ప్రపంచ దృష్టి దినోత్సవం

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని నేత్ర వైద్య సిబ్బంది డి.రాజశేఖర రెడ్డి తెలిపారు. గురువారం "26వ ప్రపంచ దృష్టి దినోత్సవం" సందర్భంగా స్థానిక ఆదివారంపేట అర్బన్ హెల్త్ సెంటర్ జిల్లా అంధత్వనివారణ సంస్థ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించు కోవాలన్నారు. 40 సంవత్సరాలు పై బడిన వారు కేటరాక్ట్, గ్లాకోమా, అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నవారు రెటీనా పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నారులలో కంటి సమస్యలు మరియు దృష్టి లోపాలు గుర్తించి సకాలంలో చికిత్స చేయించాలని చెప్పారు. వెల్డింగ్ వంటి వృత్తుల వారు కంటి అద్దాలను ధరించి కళ్ళకు గాయాలు కాకుండా కాపాడుకోవాలని తెలిపారు. పోషకాహారం




తీసుకోవాలని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్స్, లాప్టాప్లు వినియోగం తగ్గించి కంటి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వనివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ఎస్.పుష్పలత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు, పారామెడికల్ అఫ్తాల్మిక్ అధికారుల సహకారంతో కంటి పరీక్షలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఆసుపత్రులలో ఉచితంగా కంటి చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ సొంత ఆదాయాలతో గ్రామాల అభివృద్ధి





**పలాస, అక్టోబరు 9,(వార్త):**గ్రామ పంచాయతీలకు చెందిన సొంత ఆదాయ వనరులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని, దీనికై సరైన ప్రణాళికాలు రూపొందించుకోవాలని మాస్టర్ ట్రైని సద్గుణబాబు, రిసోర్స్ పర్సన్ పి ఆనంద్ రావు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సొంత ఆదయ వనరుల సమీకరణ అభివృద్ధిపై ప్రణాళికల నిర్వహణ అనే అంశంపై పంచాయితీ కార్యదర్శులు సర్పంచ్ లతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీకి చెందిన అద్దెలు, పన్నులు ఖాళీ స్థలాలపై ఆదాయ రుసుములు ఇతర స్థలాలపై రుసుము కచ్చితంగా సమకూర్చుకుంటే పంచాయతీ ఆదాయ వనరులు అధికమవుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాండ్లపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించుకోవచ్చునన్నారు. ఆస్తి పన్నులు, వృత్తి పన్నులు వాటి అంశాలపై దృష్టి సారించి పనులు సేకరిస్తే పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు పాల్గొని పలు సందేహా లను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అనురాధ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



## పంచాయతీలు సంపద సృష్టించుకోవాలి

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):** పంచాయితీలు సంపదను సృష్టించుకోవాలని శాసన సభ్యులు గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం మండలంలో స్వంత ఆదాయ వనరుల (%నా=%) పై సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమణకు ఆయన హాజరయ్యారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్ లందరు పంచాయతీ మౌలిక వసతులు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు, గ్రామాలకు కనెక్టివిటీ, డ్రైనేజ్ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీ నుండి ఇంటి పన్నులు వసూలు చేయాలని, పంచాయతీలు సొంత నిధులు సర్వసమకూర్చుకొనుటకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రకాష్, డిప్యూటీ ఎంపిడిఓ కె. సూర్యనారాయణ, సర్పంచ్ లు ,కార్యదర్శులు శిక్షణ కార్యక్రమానికి హజరయ్యారు.

## గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తుల ఆహ్వానం

**పోలాకి, అక్టోబరు 9(వార్త):** పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ (వృత్తి విద్య)గ్రూపు లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ పద్మలత ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం పైబడి మార్కులు వచ్చిన వారు కళాశాలలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు అందజేయాలి. ఈ నెల 15న శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు ఎంపిక ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పోలాకి, ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో సంప్రదించవలెను.

## ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలి



**మందస, అక్టోబరు 9(వార్త):**సమాజ శ్రేయస్సుకు ప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను నెరవేర్చాలని పలువురు వక్తలు అన్నారు. మందస పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో లోకల్ పోలీసు అధికారి, వెలుగు సీసీ, మహిళ కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశ, అంగన్ వాడీ కార్యకర్త కలసి బృందంగా ఏర్పడాలన్నారు. ఈ టీం మాదక ద్రవ్యాలు నిర్మూలన, చైల్డ్ ప్రొటెక్షన్, వీహెచ్ఎస్ఎన్డీ వంటి వాటిపై స్కూల్స్, కాలేజ్ లలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, చైతన్యం చేయాలని కోరారు. మాదకద్రవ్యాలు నిర్మూలనకై ఏర్పాటు చేసిన ఈ కన్వెర్జెన్సీ మీటింగ్ ఎంపీడీఓ వై.వెంకటరమణ, ఎంఈఓ ఎం.లక్ష్మణరావు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, సీడీపీఓ పెద్దింటి అరుణ, వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆంధ్ర యువ సంకల్ప్ 2025' ..

## డిజిటల్ మారథాన్‌లో పాల్గొనండి

**శ్రీకాకుళం, అక్టోబరు 9(వార్త):**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆంధ్ర యువ సంకల్ప్ 2025 (ఆంధ్ర యువ 2025 అంబాసిడర్)" డిజిటల్ మారథాన్ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా యువత భారీగా పాల్గొనాలని యువజన సర్వీసుల శాఖ / సెట్ శ్రీ కార్యాలయం కోరింది. ముఖ్య కార్యనిర్వహణాధికారి వావిలపల్లి వెంకటప్పలనాయుడు ఈ సందర్భంగా ఒక ప్రకటనలో వివరాలు వెల్లడిస్తూ.. జిల్లా నుంచి ఇప్పటివరకు కేవలం 56 మంది మాత్రమే రిజిస్టర్ చేసుకున్నారని, గడువును అక్టోబర్ 15, 2025 వరకు పొడిగించినందున, జిల్లా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని, మన జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుతమైన డిజిటల్ ఆవిష్కరణల విలువలను ప్రోత్సహించడం. ఈ ఇతివృత్తాలు ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నుండి తీసుకోబడ్డాయి. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు అర్హులు. ఆసక్తి గలవారు www.andhrayuvasankalp.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. పాల్గొనేవారు 120 సెకన్ల నిడివి గల వీడియో లేదా షార్ట్‌ను తయారుచేసి, నిర్దేశిత అధికారిక హ్యాష్‌ట్యాగ్‌లతో వారి స్వంత సోషల్ మీడియా ఖాతాలలో (ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్ షార్ట్స్ మొదలైనవి) పోస్ట్ చేయాలి. జ్యూరీ కమిటీ వచ్చిన ఎంట్రీలను సమీక్షించి, విజేతలను ప్రకటిస్తుంది. మొదటి బహుమతిగా రూ.1,00,000, రెండవ బహుమతిగా రూ.75,000, మూడవ బహుమతిగా రూ.50,000/- దీంతో పాటు, 9 మంది విజేతలకు "ఆంధ్ర యువ సంకల్ప్ 2025 అంబాసిడర్" గా గౌరవ సత్కారం అందిస్తారు. పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ డిజిటల్ క్రియేటర్ ఏపీ 2025 సర్టిఫికేట్ లభిస్తుంది. కావున, శ్రీకాకుళం జిల్లా యువత ఈ అరుదైన డిజిటల్ మారథాన్‌లో పెద్ద ఎత్తున పాల్గొని, తమ ప్రతిభను చాటుకోవాలని ముఖ్య కార్యనిర్వహణాధికారి వారు కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546